ప్రజాశక్తి
సోమవారం 6 అక్టోబర్ 2025
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

బల్క్‌డ్రగ్‌పై అదే తీరు..!

- మత్స్యకారుల పోరాటానికి మద్దతు తెలిపిన వారిపై పోలీసు నిర్బంధం
- రాజమండ్రిలో బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ అడ్డగింత
- ఎస్.రాయవరంలో సిపిఎం నేత అప్పలరాజు హౌస్ అరెస్టు
- పోలీసు వలయంలో రాజయ్యపేట

ప్రజాశక్తి - నక్కపల్లి, ఎస్.రాయవరం విలేకరులు

ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కుపై ప్రభుత్వ తీరు మారలేదు. నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళనపై పోలీసులు నిర్బంధం ప్రయోగిస్తూనే ఉన్నారు. పోరాటానికి అండగా నిలుస్తున్న నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. మత్స్యకారుల ఉద్యమానికి మద్దతు తెలిపేందుకు వస్తున్న భారత చైతన్య యువజన పార్టీ అధినేత బి.రామచంద్ర యాదవ్‌ను రాజమండ్రిలోని ఓ హోటల్‌లో పోలీసులు ఆదివారం అడ్డగించారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో గృహ నిర్బంధం చేశారు. నక్కపల్లి అడ్డురోడ్డులో దాట్ల ఉమా దేవిని అడ్డుకున్నారు.


రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో మోహరించిన పోలీసులు


అప్పలరాజు హౌస్ అరెస్టు

డిఎస్‌పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆదివారం నక్కపల్లిలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజయ్యపేటలో మత్స్యకారుల ఆందోళన శిబిరం వద్దకు ఇతర వ్యక్తులను రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. నక్కపల్లి, బోయపాడు, బుచ్చిరాజుపేట, టోల్ గేట్, వేంపాడు జంక్షన్ల వద్ద పోలీస్ బలగాలను మోహరించారు.

బెదరకుండా నిరసన దీక్షలు కొనసాగించిన మత్స్యకారులు

పోలీసుల ఆంక్షలు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, బల్క్ డ్రగ్ పార్కు నిలుపుదల చేయకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. వారు రాజయ్యపేటలో చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి 22వ రోజుకు మిగతా 2లో..


సముద్ర జలాల్లో ఐఎన్ఎస్ ఆండ్రోత్

నేడు నావికాదళంలోకి ఆండ్రోత్

ఎన్నో ప్రత్యేకతలు ఈ యుద్ధనౌక సొంతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో రెండో యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌక ఆండ్రోత్ సోమవారం భారత నావికాదళంలోకి చేరనుంది. సోమవారం ఉదయం విశాఖలోని నావల్ డాక్ యార్డులో జరగనున్న జల ప్రవేశ ఉత్సవ కార్యక్రమంలో తూర్పు నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అధ్యక్షతన దీనిని ప్రారంభించనున్నారు. కొల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ నిర్మించిన ఈ నౌక 'ఆత్మనిర్భర్ భారత్'కు ప్రతీక అని అధికారులు చెబుతున్నారు. 80 శాతానికిపైగా స్వదేశీ పరికరాలను దీని తయారీలో ఉపయోగించారు. దీనికి లక్షద్వీప్ దీవుల సమూహంలోని వ్యూహాత్మక ప్రాధాన్యతగల ఆండ్రోత్ ద్వీపం పేరు పెట్టారు. ఈ నౌక నిర్మాణం 2023 మార్చిలో ప్రారంభమైంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత నేవీకి అప్పగించారు. ఈ నౌకను వినూత్న సాంకేతికతలు జోడించి స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించడానికి రూపొందించారు. దీంతో నేవీ యాంటీ సబ్‌మెరైన్ వార్ సామర్థ్యాలు గణనీయంగా బలపడనున్నాయి. ముఖ్యంగా సముద్ర జలాల్లో ముప్పులను ఎదుర్కోవడంలోనూ, దేశ సముద్ర భద్రతా నిర్మాణాన్ని బలోపేతం చేయడంలోనూ ఇది కీలకపాత్ర పోషించనుంది. ఇటీవల కాలంలో పలు అత్యాధునిక యుద్ధనౌకలు నావికాదళంలో చేరాయి. ఐఎన్ఎస్ అర్నాలా, ఐఎన్ఎస్ నిస్టార్, ఐఎన్ఎస్ ఉదయగిరి, మిగతా 2లో..

నేడు స్వచ్ఛ అవార్డుల ప్రదానం

వార్త 2లో..

గాజాపై దాడులు హేయం

వార్త 8లో..

జల సంరక్షణపై దృష్టి

వార్త 2లో..


వర్షంలోనే సాగుతున్న రాకపోకలు

ఉరుములతో కూడిన భారీ వర్షం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. కాన్వెంట్ జంక్షన్, మద్దిలపాలెం, కెఆర్‌ఎం.కాలనీ సహా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒకటి రెండు చోట్ల పిడుగులు పడ్డాయి.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్టదా ?

- కురుపాం గురుకుల బాలికలకు మెరుగైన వైద్యం అందించాలి
- మృతులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్


విద్యార్థులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేట గురుకుల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినిలకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ కోరారు. చనిపోయిన విద్యార్థులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యం ప్రభుత్వానికి పట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర అస్వస్థతకు గురై విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న శివన్నపేట గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులను ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు జి.అజయ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయితేజలతో కలిసి ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు సరైన వైద్యం అందలేదన్నారు. బాధిత విద్యార్థులంతా ఇప్పటికే పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం ఆసుపత్రుల్లో చికిత్స కోసం చేరారని, వారిలో తీవ్ర అస్వస్థతకు గురైన 37 మందిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారని తెలిపారు. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వారి సంక్షేమంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నెల రోజుల క్రితం పార్వతీపురం కలెక్టరేట్ దగ్గర జరిగిన ధర్నాలో ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న సమస్యలను అధికార యంత్రాంగానికి తాము తెలియజేశామని, వాటిని పరిష్కరించకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని అన్నారు. సరైన తాగునీరు, వాష్‌రూమ్స్, విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, బస గదులు, డైనింగ్ హాలు వంటి సదుపాయాలు లేనందువల్లే ఇటీవల ఇద్దరు విద్యార్థులు ఆ పాఠశాలలో మరణించారని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యాల బారిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



రాజయ్యపేటలో నిరసన దీక్షలు కొనసాగిస్తున్న మత్స్యకారులు

బల్క్‌డ్రగ్‌పై అదే తీరు..!

చేరాయి. సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొంది బాబ్జి, పలువురు మత్స్యకార నాయకులు మాట్లాడుతూ పోలీసులు, ప్రభుత్వ తీరును ఖండించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే మత్స్యకారుల జీవన విధానానికి, ఉపాధికి నష్టం వాటిల్లుతుందని, మత్స్యకారుల ఉనికి ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. ఇటువంటి సమయంలో మత్స్యకారులు చేస్తున్న న్యాయపోరాటానికి పోలీసులు అండగా నిలుస్తుంటే, వారిని నిలువరించాలని పోలీసులు చేస్తున్న చర్యలు దుర్మార్గమన్నారు. పాయకరావుపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రజాస్వామ్యం గురించి గగ్గోలు పెట్టారని, అధికారం వచ్చాక నేడు నిర్బంధం ప్రయోగిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం శాశ్వతం కాదని ఆమె గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, ఎంపిటిసి పిక్కి సత్తియ్య, మత్స్యకార నాయకులు ఎం.మహేష్ బాబు, పి.నల్ల, జి.సోమేశ్వరరావు, సిహెచ్.సోమేష్, సిహెచ్.కాశీ, పి.తాతీలు, ఎరిపిల్లి నాగేష్, కె.కాశీరావు, పి.రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్టదా ?

పడ్డారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, కెజిబివిలు, గురుకులాల్లో తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రవీడి, రెగ్యులర్‌గా హెల్త్ చెకప్‌లు చేయాలన్నారు. చాలాచోట్ల హెల్త్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. ఈ సమస్యపై పోరాడుతున్నా సర్కారుకు పట్టలేదన్నారు. కురుపాం విద్యార్థినుల అనారోగ్య పరిస్థితులు వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నేడు నావికాదళంలోకి ఆండ్రోత్

ఐఎన్ఎస్ నీలగిరి వంటి నౌకలు తాజాగా భారత నావికా దళంలోకి చేరగా, ఇప్పుడు ఐఎన్ఎస్ ఆండ్రోత్ వాటి సరసన చేరనుంది.

ఆండ్రోత్ ప్రత్యేకతలు

ఇది సుమారు 77.6 మీటర్ల పొడవు, 900 టన్నుల బరువు కలిగి, గరిష్టంగా 25 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు. అత్యాధునిక తేలికపాటి టార్పెడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు, అధునాతన సోనార్ వ్యవస్థలతో సహ ఆధునిక ఆయుధాలు, సెన్సార్లు దీనిలో అమర్చబడ్డాయి. ఇది లోతు తక్కువగా ఉన్న నీటిలో కూడా సమర్థవంతంగా పనిచేయగలదు. ఐఎన్ఎస్ ఆండ్రోత్ పేరుతో 1972-1999 మధ్య కాలంలో భారత నౌకాదళంలో ఒక అర్నాలా తరగతి కార్వెట్‌గా ఒక నౌక సేవలు అందించింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన నౌక దాని వారసత్వాన్ని కొనసాగించనుందని అధికారులు తెలిపారు.

నేడు స్వచ్ఛ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర (ఎస్ఎఎస్ఎ) కార్యక్రమం నిర్వహించి ఉత్తమంగా నిలిచిన వారికి అవార్డులను సోమవారం ప్రదానం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు సిరిపురం వద్ద వుడా చిల్డ్రన్ ఎరీనానందు సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి, జిల్లా ఇన్చార్జ్‌మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వస్త్ర సంచుల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోరమండల్ ఇంటర్నేషనల్ విశాఖపట్నం సహకారంతో భక్తులకు వస్త్రసంచులు పంపిణీ చేశారు. దేవస్థానం వేదపండితులు ఎం.భీమశంకరశాస్త్రి, వి.హనుమాన్‌శర్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిని ప్రజలు విడనాడాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసశర్మ, జెడి ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడిఅను, దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, జెడి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

జల సంరక్షణపై దృష్టి



◆ 'ప్రజాశక్తి'తో జిల్లా నీటి నిర్వహణ సంస్థ పథక సంచాలకులు పూర్ణిమా దేవి

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో జల సంరక్షణపై దృష్టి సారించి పనిచేస్తున్నామని నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) పథక సంచాలకులు పూర్ణిమా దేవి అన్నారు. జిల్లా నీటి నిర్వహణ సంస్థ ద్వారా నీటి వనరుల అభివృద్ధి, భూ సంరక్షణ, అభివృద్ధి, ఇతర శాఖల సమన్వయంతో చేపడుతున్న కార్యక్రమాలను ఆమె 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలో సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలేంటి ?



అనకాపల్లి జిల్లాలో నీటి నిర్వహణ సంస్థ ద్వారా సహజ వనరుల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు చేపడుతున్నాం. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో ఫారం పాండ్స్, ఫీడర్ ఛానల్స్, చెరువుల్లో పూడికతీత, చేపల చెరువుల పెంపకం, అమృత్ సరోవర్ చెరువులు, నీటి నిల్వ కందకాలు, ఇంకుడు గుంతలు వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. 14955 పనులు మంజూరుకాగా, 10274 పనులు పూర్తయ్యాయి. 4,681 పనులు ప్రగతిలో ఉన్నాయి.

సహజ వనరుల యాజమాన్య పనుల ప్రగతిని తెలియజేయండి ?

సహజ వనరుల యాజమాన్య పనులకు సంబంధించి 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో జెబిఎస్ ఎస్ఎంసి, చిన్న ఊట కుంటలు, ఊట కుంటలు, చెక్‌డ్యాములు, డబ్ల్యూహెచ్, మిషన్ ఫార్మ్ పాండ్లు వంటి 116 పనులకుగాను పరిపాలన అనుమతులు లభించాయి. 507.82 లక్షల రూపాయల అంచనా వ్యయం కాగా ఇప్పటివరకు 38 పనులు పూర్తయ్యాయి. 106.2 లక్షలు ఖర్చు చేశాం. పశువుల షెడ్ల నిర్మాణానికి సంబంధించి 1290 లక్ష్యం కాగా 1062 మంజూరు అయ్యాయి. వీటికి 21.67 కోట్ల రూపాయలు కేటాయించాం.

వాటర్ షెడ్ డెవలప్మెంట్ కాంపోనెంట్ వివరాలు తెలపండి ?

వాటర్ షెడ్ డెవలప్మెంట్ కాంపోనెంట్ కింద గొలుగొండ మండలంలోని ఓ ప్రాజెక్టు, అలాగే బుచ్చియ్యపేట మండలంలోని ఆర్.శివరామపురం ప్రాజెక్టుల నిర్మాణానికి 22 కోట్లను కేటాయించాం. ఇంతవరకు 10.78 కోట్లు ఖర్చు చేశాం.

డ్వామా ద్వారా చేపడుతున్న ఇతర పనులు వివరిస్తారా ?

డ్వామా ద్వారా పశువుల నీటి తొట్టెల నిర్మాణం కోసం 400 పనులు మంజూరు కాగా 390 పూర్తయ్యాయి. ఇంకుడు గుంతల నిర్మాణం కోసం 4993 పనులు మంజూరు కాగా 3600 పూర్తయ్యాయి. ఇతర ప్రభుత్వ శాఖలైన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిసి/బిటి/డబ్ల్యూబిఎం రోడ్ల నిర్మాణాలకు సంబంధించి 1296 పనులకు 73.25 కోట్లు, సమగ్ర శిక్ష ద్వారా 277 పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి 18.82 కోట్లు, అటవీ శాఖ ద్వారా మంజూరైన 89 నర్సరీల పెంపకానికి 1.67 కోట్లు మంజూరు కాగా ఇప్పటిరకు 39 లక్షలు ఖర్చు అయ్యాయి.

అలాగే పట్టు పురుగుల పెంపకానికి 69 లక్షల రూపాయలు కేటాయించగా 19 లక్షలు ఖర్చయ్యాయి.

వేణుగోపాలరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్: ఫిలిం సొసైటీ స్థాపించి సినీ రంగానికి ఆచార్య వేణుగోపాలరావు సేవలు అందించారనిఅనకాపల్లి ఫిలింసొసైటి కార్యదర్శి పి.ఎస్ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆచార్య వేణుగోపాలరావు మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో వేణుగోపాలరావు స్మార కోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సినిమాల కోసం ఆచార్య వేణుగోపాలరావు పరితపించారని, ఫిలిం సొసైటీని స్థాపించి, ఫిలిం ఎక్స్‌ప్రెషన్ కోర్సు ప్రవేశపెట్టారన్నారు. సినిమాలు సమాజంపై చూపించే ప్రభావం గూర్చి వివరించారు. గురజాడ కన్యాశుల్కం నాటకం స్టేజిపై ఒకలా ఉంటుందని, ఎన్టీఆర్ నటించిన సినిమాలో జీవితానికి దగ్గరగా ఉంటుందని చెప్పారు. కేరాఫ్ కంచరపాలెం సినిమా వాస్తవానికి దగ్గరగా, చుట్టూ జరుగుతున్నట్లు ఉంటుంద న్నారు. అటువంటి సినిమాలు రావడం అరుదుగా జరుగుతుంది జీవితానికి దగ్గరగా ఉండే సినిమాలు రావాలని వేణుగోపాలరావు ఆకాంక్షించే వారిని చెప్పారు. ప్రొఫెసర్ కె.సుధా, సీనియర్ న్యాయవాది వి.కళ్యాణరామారావు పాల్గొన్నారు.

దళితుల సాగు భూములు తీసుకోవడం తగదు

సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎన్.మూర్తి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ పరిధి ఎస్సి కాలనీ దళిత రైతుల సాగు భూములను గూగుల్ టేక్ కంపెనీకి అప్పగించడం తగదని సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పేర్కొన్నారు. తర్లువాడ గ్రామంలో దళిత రైతులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరించకూడదన్నారు. సర్వే నంబర్లు 1, 35, 71, 72, 74, 75ల్లో ఉన్న భూములను ల్యాండ్ పూలింగ్ పేరుతో గూగుల్ టేక్ కంపెనీకి అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఎస్సి రైతులకు రెండు ఎకరాలు చొప్పున కేటాయించారని, అప్పటి నుంచి రైతులు జీడిమామిడి, సపోటా, నిమ్మ వంటి పంటలను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఇటీవల ఆ భూములను రైతుల అనుమతి లేకుండా ప్రభుత్వం, అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అనుమతి లేకుండా భూములను స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధమని, 60 ఏళ్లగా సాగు చేస్తున్న భూములపై రైతులకే హక్కు ఉంటుందని, హైకోర్టు కూడా బలవంతపు స్వాధీనం చెల్లదని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. రైతుల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జోన్ సహాయ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు, 49 మంది రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన ఆటో

ప్రజాశక్తి- వద్దాది : బుచ్చయ్య పేట మండలం విజయరామరాజుపేట.తాచేరు వంతెనపై ఆటో బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాచేరు వంతెన కొట్టుకుపోవడంతో బిఎన్ రోడ్డులో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వారం రోజులుగా గొట్టాలు పేర్చి, మట్టిని కప్పి రాకపోకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే కురుస్తున్న వర్షాలకు మట్టి బురదయమం, గోతులు కావడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలు స్కిడ్ అవుతూ ప్రమాదానికి గురౌతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం టాటా ఏస్ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. అధికారులు స్పందించి రహదారిని పటిష్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి అయ్యప్పనగర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాష్‌ను పౌర సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగోతి సూర్యప్రకాష్ మాట్లాడుతూ, కీర్తిశేషులు మల్లువలస జగదీశ్వరరావును స్మరిస్తూ తనకు పౌర సంక్షేమ సంఘం తల్లివంటిదని, ప్రజా సమస్యలను ఈ సంఘం ద్వారానే ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసేవారిమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్.నాయుడు, మరుపల్లి పైడిరాజు, బెల్లపు పాపారావు, శ్రీపాదవెంకటరమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, ఎస్.రమేష్, బిఎస్.రావు, యమాల, శంకరరావు, బయపల్లి సతీష్‌కుమార్, టి.మోహనరావు, తోట ఆశ, వానపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌కు పోటెత్తిన జనం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ బీచ్ పర్యాటకులు, స్థానికులతో ఆదివారం కిటకిటలాడింది. పరిసర ప్రాంతాలతో పాటు నగరం నలుమూలల నుండి, ఇతర ప్రాంతాల టూరిస్టులు సముద్రపు అందాలను వీక్షించడానికి, సరదాగా గడపడానికి పోటెత్తారు. సెలవు కావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన సందర్శకులతో బీచ్ పరిసరాలు ఉదయం నుండే సందడిగా మారాయి.

బెల్ట్ షాపులను నివారించాలి

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలంలోని పలు గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రముఖ స్వచ్ఛంద సేవకులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కంటి మహంతి శివ ప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రతి వీధిలోనూ మద్యం బెల్ట్ షాపులు ఎక్కువై పోయాయని, దీనివల్ల కలహాలు ఎక్కువై కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు చాలా వేదనకు గురవుతున్నారన్నారు. ఇటీవల తగరపువలసలో మద్యం తాగి కన్న కూతురుపైనే అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి ఉదంతాన్ని చూశామని గుర్తుచేశారు. వెలుగులోకిరాని ఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. మద్యం విరివిగా దొరకడమే వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి నేరాలు జరగకుండా ఉండాలంటే తక్షణం మద్యం బెల్ట్ షాపులు నిషేధించాలని కోరారు.

జూ పార్కులో పక్షి వీక్షణం


పక్షి వీక్షణంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

ప్రజాశక్తి - ఆరిలోవ : వన్య ప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆదివారం విద్యార్థులకు పక్షి వీక్షణం, ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించారు. నగరంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పక్షి వీక్షణం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సుమారు 30 పక్షి జాతులను గమనించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ, వన్యప్రాణి సంరక్షణ, విద్యపై అవగాహన పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మంగళవారం జరగబోయే ఎలక్యూషన్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, జూ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలకు బోర్డులేవీ?



ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి జోన్ 8 పరిధిలో చాలా సచివాలయాలకు చిరునామా బోర్డులు లేవు. చిరునామా బోర్డులు లేకపోవడంతో సచివాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. వేపగుంట జోనల్ కార్యాలయం పక్కనే 487 సచివాలయం ఉంది. దీని పరిధిలో సుమారు 3500 జనాభా ఉన్నారు. అప్పలసికాలనీ, ఆంజనేయనగర్ ప్రజలు ఈ సచివాలయం పరిధిలోకి వస్తారు. కానీ సచివాలయానికి బోర్డు లేక వారంతా అవస్థలు పడుతున్నారు.


ఆటో డ్రైవర్లతో కార్పొరేటర్ చిన్ని కుమారి లక్ష్మి

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి -తగరపువలస : కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తోందని జివిఎంసి 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి చెప్పారు. స్థానిక వై జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్రైవర్లతో కలిసి స్వయంగా ఆమె ఆటో నడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద ఒక్కో ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న అదీప్‌రాజు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 88వ వార్డు పరిధి సత్తివానిపాలెంలోని సత్తెమ్మతల్లిని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నెక్కల గురుమూర్తి, గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, బొడ్డపల్లి హేమంత్ కుమార్, నూక అప్పారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా గరుడసేవ తిరువీధి

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో సింహాద్రి అప్పన్న గరుడ సేవ గ్రామ తిరువీధి వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రభుత్వ ఆస్తుల ప్రయివేటీకరణపై బుద్ధి చెప్పాలి

వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కన్నబాబు

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటుపరం చేయడానికి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ఆనందపురంలోని ఒక కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అమలుచేయడంలేదన్నారు. వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

విద్య, వైద్య రంగాలకు వైసిపి ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యతనిచ్చినప్పటికీ, కూటమి పాలకులు ప్రయివేటీకరణ దిశగా నడుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సంపదను పిపిపి పేరుతో ప్రయివేటు చేతుల్లోకి వెళ్లేలా చూస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం ప్రారంభించిన 17 మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రజల ఆరోగ్య హక్కులపై దెబ్బ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యాచారాలు, నేరాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. పాయకరావుపేటలో బల్క్ డ్రగ్స్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు వైసిపి మద్దతు ఉంటుందని తెలిపారు. విశాఖలో ప్రభుత్వ భూములను అమ్మడం, అమరావతికి అప్పులు చేయడం తప్ప రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. వంశధార ప్రాజెక్టు 1955లో ప్రారంభమైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కురసాల కన్నబాబు

అదాని సిమెంట్‌ను వ్యతిరేకిస్తూ ప్రచార జాతా

ప్రజాశక్తి -గాజువాక : అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం పాత గాజువాకలో ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, అదాని సిమెంట్ పరిశ్రమ ఏర్పడితే గాజువాక మొత్తం ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే అదాని గంగవరం పోర్టుతో గాజువాక నియోజకవర్గం మొత్తం కాలుష్యమయమైందన్నారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే నీటి, శబ్ద కాలుష్యంతో పాటు నైట్రేట్, కార్బన్‌డయాక్సైడ్ వంటివి విడుదలై ప్రజల ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయని ఆవేదన వ్యక్తంచేశారు.

సిపిఎం స్టీల్ జోన్ నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అదాని సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతి ఇచ్చి ప్రజలను అనారోగ్యాలపాల్జేస్తుందని విమర్శించారు. ఈ నెల 8వ తేదీన జరిగే ప్రజాభి సేకరణలో పెద్ద ఎత్తున ప్రజల పాల్గొని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, గంగవరం పోర్టుకు వచ్చివెళ్లే వాహనాలతో 100 అడుగుల రోడ్డు నుండి వై.జంక్షన్ వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అదాని సిమెంట్ పరిశ్రమ వస్తే మరింత దారుణంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ నాయకులు ఎల్.బంగారినాయుడు, ఎ.లోకేష్, గొలగాని అప్పారావు, బి.అప్పారావు, జి.రాము, నానాజీ, స్టీల్ జోన్ నాయకులు నమ్మి రమణ, వైటి.దాస్, అప్పలరాజు, ఒవి.రావు పాల్గొన్నారు.



జాతానుద్దేశించి మాట్లాడుతున్న ఎం.రాంబాబు

అదాని సిమెంట్‌ను అడ్డుకుంటాం

అదాని సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని వైసిపి 76వ వార్డు అధ్యక్షుడు మంత్రి శంకర్ నారాయణ చెప్పారు. నడుపూరులో ఆదివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శంకరనారాయణ మాట్లాడుతూ, అదాని సిమెంట్ ఫ్యాక్టరీపై ఈ నెల 8వ తేదీన జరిగే పబ్లిక్ హియరింగ్‌కు అందరూ హాజరై వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అదాని గంగవరం పోర్టుతో దుమ్ము, ధూళి వస్తుందని, ఇది చాలదన్నట్లు సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తూ ఇప్పటికే పెదగంట్యాడ తహశీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో తాడికొండ జగదీష్, తలారీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి- గాజువాక : పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్ రిటైర్డ్ అసోసియేషన్ నాయకులు కె.పరంధామయ్య డిమాండ్‌చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పెన్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరంధామయ్య మాట్లాడుతూ, భారతదేశంలో 78 లక్షల మంది పెన్షన్‌దారులు ఉన్నారని తెలిపారు. ఉద్యోగి 35 సంవత్సరాలు పాటు సర్వీస్ చేస్తే రూ.వెయ్యి నుంచి రూ.3000 మాత్రమే పెన్షన్ వస్తుందన్నారు. మినిమం పెన్షన్ రూ.9000 ఇవ్వాలని, దానికనుగుణంగా డిఎ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అసోసియేషన్ జిల్లా నాయకులు కె.దీనబంధు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పుకు మూడేళ్లు గడిచినా 95 పెన్షన్‌దార్లకు ఆ తీర్పు అమలు కాలేదని తెలిపారు. ఈ సమావేశంలో నమ్మి అప్పలనాయుడు, మేడిశెట్టి వెంకటరావు, మంత్రి గోపీనాథ్, బెల్లాల్ నాగేశ్వరరావు, శేసెట్టి అప్పారావు, శ్రీనివాస్, నరసింహులు పాల్గొన్నారు.



కామెడీ షోలో ప్రదర్శనలిస్తున్న కళాకారులు

వినోదాల విందులో కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా పౌరగ్రంథాలయం ఆదివారం కామెడీ షో నిర్వహించారు. ఎంవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్ ప్రకాష్, పుష్పమి రాగన్‌నాయుడు, సూర్య, ఎస్ఎస్.నాయుడు, పోర్ట్ శేషు, భాను ప్రకాష్ లఘు నాటికలను ప్రదర్శించారు. అత్తగారి ఏడుపు, థియేటర్‌లో ఉన్నాను, కవిత, అన్నదానం, ఎంతమంది పిల్లలు, దారి ఎటు పోతుంది, సెలూన్, ఇంజినీరింగ్ కుటుంబం, రేటు ఎంత, డాక్టర్ పేషెంట్, డిశ్చార్జ్ ఎప్పుడు తదితర నాటికలను ప్రదర్శించి నవ్వులు పండించారు. పెదగంట్యాడకు చెందిన శివ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన గురువు శివా శిష్యు, లిఖిత, సంజనలచే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలిచ్చారు. నటీనటులను, నర్తకీమణులను అతిథులు సన్ మూర్తి, బి.మాల్యాద్రి, సాత్యకి ప్రసాద్, ఎల్‌బి.వెంకటరావు. శివ కుమార్ సన్మానించారు. మెమోంటోలను అందజేశారు.



తగరపువలసలో బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను ప్రారంభిస్తున్న నికేష్ కుమార్ సిన్హా

బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖలు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : బ్యాంక్ ఆఫ్ ఇండియా మారికవలస, తగరపువలస ప్రాంతాల్లో నూతన శాఖలను బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమన్నారు. ఈ విస్తరణతో బ్యాంక్ ఆఫ్ ఇండియా తన అత్యుత్తమ బ్యాంకింగ్ సేవలను అందించడమే గాకుండా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కట్టుబాటును మరోసారి బలపరుస్తోందని తెలిపారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.సీతారాం మాట్లాడుతూ, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు సహా అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు బంగారం తాకట్టు, పంట, ముద్ర రుణాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగేష్, పలువురు బ్యాంక్ అధికారులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అప్సా ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డులు



అవార్డు, జ్ఞాపికను అందుకుంటున్న ప్రయివేటు స్కూల్ ప్రతినిధి

ప్రజాశక్తి -గాజువాక : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏపి ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన పలువురు సీనియర్ ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లుకు అప్సా సంఘ పెద్దలు ఉట్ల సుందరం, కౌన్సిల్ చైర్మన్ కె.చంద్రశేఖర్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెట్ల జనార్దన్, అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం కోశాధికారి శ్రీహరి తదితరులు అవార్డులను అందించారు. గాజువాక సీనియర్ సభ్యులైన సిద్ధార్థ స్కూల్ ప్రతినిధి ఎం.జగ్గారావు, బివిఎన్ స్కూల్ ప్రతినిధి పి.భాస్కరరావు, శ్రీహరి విద్యామందిర్ ప్రతినిధి ఎం.హరనాథ్, శ్రీగిరి స్కూల్ ప్రతినిధి వివి.గిరి, ప్రతిభ స్కూల్ ప్రతినిధి టి.రమణిలను ఐ కాన్ అచీవ్ మెంట్ అవార్డులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రాంతాల నుండి సుమారు 400 మంది ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -సీతమ్మధార : జనసేన బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీలో చేరిన పలువురు నాయకులు చెప్పారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో 29వ వార్డులోని 100 మంది వైసిపికి చెందిన యువకులు జనసేనలో చేరారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో ఆదివారం వీరికి వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలకు, ఆశయాలకు అనుగుణంగా వంశీకృష్ణ శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై జనసేనలో చేరినట్లు వెంకటేశ్వరనగరకు చెందిన మజ్జి శ్రీను, దువ్వి లోకేష్, అడ్వకేట్ శ్రీనివాస్, కట్టా అనిల్, రాజు, అమర్నాథ్, రాహుల్, వీర, విజయ్, బోని విజయ్, శివ, వెంకటేష్, రాజేష్, చంద్ర శేఖర్, జగన్, కిరణ్, మణికంఠ, పవన్, సత్తిరాజు, త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, వార్డులో జనసేన నాయకత్వం బలంగా ఉందన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పివి.శివప్రసాదరెడ్డి, గొలగాని రవిశ్వరావు, బుద్దల అనురాధ, మన్యాల శ్రీనివాస్, అంగటి శ్రావణ్‌కుమార్, కిలాని వెంకటేష్, కర్రి చిన్ని, పెసలు శివ పాల్గొన్నారు.



జనసేనలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వైసిపి భీమిలి విద్యార్థి విభాగం అధ్యక్షులుగా శ్రీను

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ నీలకుండీలకు చెందిన రౌతు శ్రీను వైసిపి భీమిలి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీను గతంలో విద్యార్థి విభాగం అధ్యక్షునిగా పనిచేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ అవకాశం కల్పించిన సమన్వయకర్త మజ్జి శ్రీను, కోరాడ వెంకటరావు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్న శ్రీనును కలిసిన హనుమంతరావు

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ 5వ వార్డు మాజీ కార్పొరేటర్, వార్డు వైసిపి అధ్యక్షులు పోతిన హనుమంతరావును పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించిన సందర్భంగా భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును ఆయన నివాసంలో వార్డు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పోతిన హనుమంతరావు మాట్లాడుతూ పార్టీ తనకు ఇంతటి బాధ్యతను అప్పగించినందుకు జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతుడై ఉంటానని, బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో 7, 8 వార్డుల పార్టీ అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, సీనియర్ నాయకులు బోర శ్రీను, పోతిన సురేష్‌కుమార్, పోతిన మూర్తిబాబు, పోతిన శేషుబాబు, ముచ్చి రామారావు, రిషికేష్, బాబ్జీ, అప్పలరెడ్డి, కామేష్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సనపల నరేందర్ జన్మదిన వేడుకలు



నరేందర్‌కు కేక్ తినిపిస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి- మాధవధార : ప్రముఖ విద్యావేత్త, సంఘ సేవకులు సనపల నరేందర్ జన్మదిన వేడుకలు మాధవధారలోని ఆయన కార్యాలయంలో చిన్ననాటి స్నేహితులు ఘనంగా నిర్వహించారు. భారీ కేకును కట్ చేసి స్నేహితులందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ, ఏటా తన పుట్టినరోజున నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న అనాథలకు భోజనం, వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన మాధవధార గ్రామ ప్రజలకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు నంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్, తమ్మినేని వెంకటేష్, చౌదరి నాగేశ్వరరావు, అన్నెపు తారక రవికుమార్, సనపల వెంకటరావు, సనపల హరిబాబు, మిత్రులు, అభిమానులు పాల్గొని నరేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలి



సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న అప్పారావు

ప్రజాశక్తి-అనకాపల్లి : సీనియర్ సిటిజనుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని అనకాపల్లి జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు(కెప్టెన్) కోరారు. ఆదివారం స్థానిక వివి రమణ రైతుభారతి ఆడిటోరియంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వయోవృద్ధులకు రూ.ఆరు వేలు సామాజిక భరోసా పెన్షన్ ఇవ్వాలని, అరవై ఏళ్లు దాటిన పురుషులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, రైల్వేలో ప్రయాణ రాయితీ పునరుద్ధరించాలని, అనకాపల్లిలో వయోవృద్ధులకు సంఘ సమావేశాలు నిర్వహించు కునేందుకు స్థలాన్ని లేదా ఒక గదిని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వయోవృద్ధులను సత్కరించారు. సాంబ మూర్తిరాజు, కర్రిశ్రీరాములు, కర్రి జగ్గప్పారావు పాల్గొన్నారు.

యూరియా కొరతతో ఇబ్బందులు


ప్రజాశక్తి- సబ్బవరం : యూరియా కొరతతో మండలంలోని పలు గ్రామాలలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇరువాడ గ్రామానికి చెందిన టిడిపి జిల్లా బిసి సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ అన్నారు. రైతుసేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేకపోగా, కనీసం ప్రయివేటు వ్యాపారుల వద్ద కూడా దొరకకపోవడంతో ప్రస్తుతం పిలకకట్టే దశలో వరిపైర్లుకు నష్టం జరిగే పరిస్థితి ఉందన్నారు. ఇరువాడ, అసకపల్లి, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం పంచాయతీలకు నెలరోజుల క్రితం 220 బస్తాల యూరియాను పైడివాడ అగ్రహారం సచివాలయం ద్వారా అందజేశారని, ఇపుడు యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రైతుసేవా కేంద్రాలు, ప్రయివేటు డీలర్ల వద్దయూరియా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

దీనిపై పైడివాడ అగ్రహారం గ్రామ వ్యవసాయ సహాయకులు పి. అలేఖ్యను వివరణ కోరగా నాలుగు వారాల క్రితం ఇరువాడ, అసకపల్లి,పైడివాడ అగ్రహారం, గొల్లపాలెం నాలుగు పంచాయతీలకు 11టన్నుల యూరియా అందించామన్నారు. యూరియా కావాలని ఇండెంట్ పెట్టామని,వారంరోజులల్లో రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు.

రాంకీ అకృత్యాలకు ప్రభుత్వం అండ!

- యథేచ్ఛగా రసాయన వ్యర్థాలు విడుదల
- కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర చైర్మన్ పరిశీలన తర్వాత కూడా అదే నిర్లక్ష్యం..
- సిఐటియు నాయకులు గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాద: వ్యర్థ రసాయనిక జలాలను విచ్చలవిడిగా విడుదల చేస్తూ ప్రజలను, ముఖ్యంగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న రాంకీ యాజమాన్యంపై కఠినచర్యలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలోని బరిణికం, మొల్లోడు గెడ్డల మధ్య ప్రాంతంలో రాంకీ కంపెనీ అక్రమంగా వదిలేసిన వ్యర్థాలతో కలుషితమైన మొల్లోడుగెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వ్యర్థ రసాయనాలతో భూగర్భ, ఉపరితల జలాలు కాలుష్యకారకం కావడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని రైతులు పంటలను సాగుచేయలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల జీవనానికి ముప్పు కలిగించే రాంకీ దుశ్చర్యలపై గతంలో ఫిర్యాదులు చేయగా, రాంకీ యాజమాన్యానికి నోటీసులిచ్చి, తదుపరి చర్యలేవీ చేపట్టకుండా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తప్పించుకున్నారని విమర్శించారు. కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర చైర్మన్ కృష్ణయ్య స్వయంగా ఈ ప్రాంతాన్ని పరిశీలించినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు లేకపోవడం ఆందోళనకరమన్నారు. దీన్నిబట్టి రాంకీ యాజమాన్యం అక్రమ చర్యలకు రాష్ట్రస్థాయిలోనూ ప్రభుత్వం, పెద్దల అండదండలున్నాయని స్పష్టమౌతోందన్నారు. వ్యర్థ రసాయన జలాలను తోడించి, ఈ ప్రాంతాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, రాంకీ యాజమాన్యంపై తక్షణ చర్యలు చేపట్టకుంటే పెద్దఎత్తున ఆందోళన తప్పదని గనిశెట్టి హెచ్చరించారు.



మొల్లోడుగెడ్డలో రాంకీ రసాయన వ్యర్థాలను చూపుతున్న గనిశెట్టి


నేటి విత్తన బంతులే రేపటి మహా వృక్షాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : నేటి విత్తన బంతులే రేపటి మహా వృక్షాలుగా మారుతాయని జిల్లా అటవీ శాఖ అధికారి ఎం శ్యాంసుందర్, శ్రీ వేమగిరి సత్యనారాయణ దేవస్థాన చైర్మన్ అప్పికొండ గణేష్, విశ్రాంత అటవీశాఖ అధికారి బి జానకి రామ్, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టర్ అన్నారు. ఆదివారం మండలంలో కొత్తూరు గ్రామంలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో విత్తన బంతులు విసరే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచడంలో విత్తన బంతులు ప్రభావవంతమైన పని చేస్తాయన్నారు. విత్తనాలను నేరుగా భూమిపై నాటడం కంటే విత్తన బంతులు ద్వారా విత్తనాలను పక్షులు కీటకాలు నుంచి రక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లబ్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోల్ అధికారి కాండ్రేగుల సూర్య సత్యనారాయణ, భోగ లింగేశ్వర దేవస్థాన చైర్మన్ ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, విశ్రాంత అటవీ అధికారి బీర వినోద్ కుమార్, నైసెట్టి సత్తిబాబు, వంకాయల ఈశ్వరరావు, బేతాళం శేష సాయి పాల్గొన్నారు.



విత్తన బంతులు విసిరే కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



దిబ్బిడి పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట: మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం దిబ్బిడి హైస్కూల్ జరిగిది. 17ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులంతా కలుసుకుని, నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. పరస్పర క్షేమసమాచారాలు తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన మాస్టార్లు వివి అప్పారావు, అరుణ్‌కుమార్, జయలక్ష్మి, పద్మజ, లక్ష్మిసాయి వర్మ తదితరులను ఘనంగా సత్కరించారు.

అచ్యుతాపురం : 45 ఏళ్ల క్రితం మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అచ్యుతాపురం మండలం చోడమాంబిక ఆలయం ఆవరణలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆరోగ్యంతోపాటు స్థితిగతులపై పరస్పర యోగక్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పెంటకోట రాము, ఆరోగ్య విస్తరణ అధికారి సూరిశెట్టి శ్రీనివాస్ మిత్రులకు ఆరోగ్యసూచనలు చేశారు. సహాఫంక్తి భోజనాలు చేశారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఉద్యోగ విరమణ చెందిన తోటి స్నేహితులను సత్కరించారు. పూర్వ మిత్రులసంఘానికి వారు రూ. 80వేల విరాళం అందించారు.

కె కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001- 02 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. తమకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులు స్వర్ణలత, తులసి పద్మజ, పొలిమేర కృష్ణకుమారి, కుల్లయ్య తదితరులను సత్కరించారు. ఉపాధ్యాయులు గోపీనాథ శర్మ, ఆంజనేయులు, పూర్వవిద్యార్థులు కోలా మహేష్, కట్టు ప్రవీణ్, బత్తి ఎర్రి నాయుడు, భూపతి మోహన్, ఈర్లె రమేష్, కండిపల్లి రమణ, జిలం దేముళ్ళు, మొల్లి రాధాకష్ణ, రాజగిరి రామకష్ణ, రాళ్లపల్లి నరసింహమూర్తి, బండారు దొంగబాబు, గోగాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం : విశాఖ ఎవిఎన్ కళాశాల 1977 - 80 సైన్స్ బ్యాచ్ విద్యార్థులు స్థానికంగా ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. దాదాపు 45 ఏళ్ల క్రితం చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఎంతో మంది వైద్యులుగా, ప్రొఫెసర్లుగా, పారిశ్రామిక వేత్తలుగా, పేరెన్నిక గన్న పలు కంపెనీలకు సలహాదారులుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు సంస్థల్లో ఇంజినీర్లుగా ఎన్నో ఉన్నతోద్యోగాల్లో స్థిరపడిన వారు ఉన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

సహచరుని కుటుంబానికి ఆర్థిక చేయూత

అచ్యుతాపురం :అచ్యుతాపురం హైస్కూల్‌లో 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆ బ్యాచ్‌లో చదువుకున్న జంగులూరు గ్రామానికి చెందిన మాసవరపు అప్పలరాజు అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న సహచర విద్యార్థులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అప్పలరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అప్పలరాజుతో కలిసిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహచరుని కుటుంబానికి పూర్వ విద్యార్థులంతా రూ.55వేలు ఆర్థిక సహాయాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. తోటి స్నేహితుడికి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు.



చనిపోయిన సహచరుని కుటుంబానికి సాయం ఇస్తున్న మిత్రులు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- రాలేని వారికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకు అవకాశం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కలెక్టరేట్‌తో పాటు జిల్లాలో అన్ని మండల, మునిసిపల్, డివిజనల్ కార్యాలయాల్లోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తారన్నారు. అనివార్య కారణాలతో పిజిఆర్ఎస్‌కు హాజరు కాలేనివారు తమ అర్జీలను meekosam.ap.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ సూచించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార సమాచారాన్ని 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోను చేసి తెలుసుకోవచ్చని,అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఒకేషనల్ కోర్సు విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్



బ్యూటీషియన్ సెంటర్‌లో శిక్షణలో విద్యార్థినులు

ప్రజాశక్తి- పరవాడ: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి ఒకేషనల్ కోర్సు విద్యార్థినులకు 'బ్యూటీ అండ్ వెల్నెస్' విభాగంలో పది రోజులపాటు ఇంటర్న్‌షిప్ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులను పరిసర ప్రాంతాల్లోని వివిధ బ్యూటీ పార్లర్లకు తీసుకువెళ్లి ఆ విభాగంపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. విద్యార్థినులు అందాల సేవలపై ప్రత్యక్ష అనుభవాన్ని సంతరించుకున్నారు. హెచ్ఎం గొల్ల రాజశ్రీ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, బ్యూటీ అండ్ వెల్నెస్ విభాగం బోధకురాలు కముండూరి జ్యోతిర్మయి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా విద్యార్థినులకు భవిష్యత్తులో త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అలాగే స్వయం ఉపాధికి దోహదపడతాయన్నారు.

భూమి కొలతలపై అవగాహన



విద్యార్థులకు అవగాహనా కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-బుచ్చయ్య పేట : మండలంలోని దిబ్బిడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు నైపుణ్యం శిక్షణపై అవగాహనా కల్పిస్తున్నారు. పాఠశాల గణిత ఉపాధ్యాయులు ఏ.వి.ఎస్. మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో గణితంపై ప్రయోజనకరమైన అవగాహన, ప్రయోగాత్మక విద్య, వ్యవసాయ అవగాహన, వృత్తి దిశగా మార్గదర్శనం, పర్యావరణ అవగాహన చర్యల్లో భాగంగా ఆదివారం వ్యవసాయ భూములకు తీసుకెళ్లి, భూముల వైశాల్యం చుట్టుకొలతలు ఎలా కనుగొనాలో ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు కె. సత్యారావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా వివిధ భాషా, సైన్స్, సోషల్, గణిత క్లబ్‌ల ద్వారా విద్యార్థుల్లో విభిన్న నైపుణ్యాలను అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ద తీసుకొని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు.

వర్షంతో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలో ఆదివారం సాయంత్రం పలు గ్రామాల్లో ఉరుములతో కూడిన వర్షం పడింది. రహదారులపై వర్షం నీరు ఏరుల ప్రవహించింది. కల్వర్టుల్లో వ్యర్థ పదార్థాలు చిక్కుకోవడం వలన నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

బీమా పరిహారం చెక్కుల పంపిణీ



చెక్ అందిస్తున్న భీమరశెట్టి రాంకీ

ప్రజాశక్తి- కశింకోట : వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన ఇద్దరు జనసేన క్రియాశీల సభ్యుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా పరిహారం చెక్కులను అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ(రాంకీ), మండల టిడిపి అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తిలు ఆదివారం తాళ్లపాలెం గ్రామంలో అందజేశారు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన తోరం చిన్నం నాయుడు, మట్టా శ్రీనులు ఇటీవల ప్రమాదంలో మృత్యువాత పడగా, వారి కుటుంబసభ్యులు తోరం వరలక్ష్మి, మట్టా వెంకటలక్ష్మిలకు పరిహారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కర్రి వెంకటసత్యనారాయణ, ఎన్‌టిఆర్ వైద్యాలయం డైరెక్టర్ ఉల్లింగల రమేష్, కలగ సోమేశ్వరరావు, కలిగొట్ల సింహాద్రి, కర్రి గోవింద, కర్రి లోవరాజు, అయినాల నాయుడు, తోరం గణేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



దోమ పోటు తెగులు ఆశించిన వరి పైరు

ప్రజాశక్తి- కె.కోటపాడు : పొట్ట దశకు చేరుకున్న సమయంలో వరిపైర్లకు తెగుళ్లు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వ్యవసాయ అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 2348 హెక్టార్లు కాగా, అంతకుమించి 2782 హెక్టార్లలో వరి నాట్లు వేశారన్నారు. వర్షాలు, వాతావరణ పరిస్థితులు ఆదిలో అనుకూలించడంతో వరిసాగుపై రైతులు మొగ్గు చూపారన్నారు. ప్రస్తుతం మండలంలో వరి పంటపై దోమ పోటు, ఆకుముడత, కాండము తొలిచే పురుగు, పాము పొడ తెగులు ఆశించి ఉందన్నారు. రైతులు చెప్పిన సమస్యలతోపాటు క్షేత్రస్థాయి పరిశీలనలో ఆయా సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటి నివారణకు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి, వారి సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

వంతెన లేక రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి: రెండు జిల్లాల సరిహద్దు గరుగుబిల్లి-కొండపర్తి గ్రామాల మధ్య వంతెన లేక గిరిజనులు నానా అవస్థలకు గురవుతున్నారు. గరుగుబిల్లి పంచాయతీ గరుగుబిల్లి, విజయనగరం జిల్లా ఆంధ్ర పంచాయతీ కొండపర్తి గ్రామాల సరిహద్దులో వంతెన నేటికీ వంతెన లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగువ ప్రాంతంలో ఉన్న ఆంధ్ర డ్యామ్‌కు ఈ వంతెన పై నుంచే గెడ్డ భారీ ఎత్తున ప్రవహిస్తుంది. విజయనగరంలో వివిధ పనుల నిమిత్తం అనంతగిరి మండలానికి బీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీలతో పాటు మండలాని కి చెందిన పలువురు ఈ రహదారిపైనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మెంటాడ మండలం సమీపంలో అనంతగిరి మండలానికి చెందిన నాన్ షెడ్యూల్ రొంపలి పంచాయతీ ఉంది. ఈ పంచాయతీ పరిధి గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో ఈ గెడ్డను దాటి వెళ్లలేని పరిస్థితి ఉందని రెండు జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు దృష్టి సారించి సరిహద్దు గ్రామాల వద్ద వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాల్సిందే

- అప్పలరాజు గృహ నిర్బంధం దారుణం : సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



రాంబిల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజయ్యపేట గ్రామం పర్యటనకు బిసివై పార్టీ నేత బోడే రామచంద్ర యాదవ్ వస్తున్న నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మత్స్యకారుల ఆందోళనకు కారణమైన బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాల్సింది పోయి, వారికి మద్దతుగా నిలుస్తున్న సిపిఎం నాయకులను నిర్బంధించడం దుర్మార్గమన్నారు. జిల్లాలో ఏ సమస్య తలెత్తిన ముందుగా సిపిఎం నాయకులను అరెస్టు చేయడం పోలీసులకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ప్రజలకు చేస్తున్న అన్యాయాలు, అపరిష్కృత సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తూ, పౌరహక్కులకు భంగంకలిగించేలా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు హేయమని ఖండించారు. అణిచివేత, నిర్బంధ చర్యలను మానుకొని ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. విపక్షంలో ఉన్నపుడు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడిన టిడిపి నేతలు, నేడు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు.నాడు బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని నినదించిన హోంమంత్రి అనిత నేడు అధికారంలోకి రాగానే ఏర్పాటు చర్యలను సమర్థించడంపై సమాధానం చెప్పాలన్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌తో మత్స్యకారుల జీవనోపాధి, స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని, సముద్ర కాలుష్యం పెరిగి మత్స్య సంపద నాశనమౌతుందని ప్రజలు ఆందోళన చెందుతుంటే, అభివృద్ధి పేరిట ప్రజల జీవన భద్రతలను గాలికొదిలేసి, కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సిపిఎం నిరసన

రాంబిల్లి: సముద్ర జలాలను విషతుల్యం చేసి, మత్స్యకారుల జీవనోపాధిని ప్రశ్నార్థకం చేస్తున్న బల్క్ డ్రగ్ పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మత్స్యకారుల ఆందోళనకు మద్దతిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజును అక్రమ గృహనిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం రాంబిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సముద్రతీరంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకరరావు, మండల కార్యదర్శి జి దేవుడునాయుడు మాట్లాడుతూ మత్స్యకారుల ఆవేదన, ఆందోళనను పరిష్కరించకుండా మద్దతిస్తున్న వారిని అరెస్ట్ చేయడంతో సమస్య పరిష్కారం కాదని, కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, అణిచివేత చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. గత ప్రభుత్వం మాదిరిగానే, ముందస్తు అరెస్టులు, అక్రమ గృహనిర్బంధాలతో ప్రజా సమస్యలపై మాట్లాడేవారు గొంతు నొక్కడం సరికాదని మండిపడ్డారు. ఇలాంటి చర్యలతో ప్రజా ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు, నారాయణరావు, రామకృష్ణ, ధోని కాసియా, వై.రాము, సిహెచ్.అప్పలరాజు, రమణ, శివాజీ మహిళా సంఘం నాయకులు వరలక్ష్మి, మాణిక్యం, మంగతాయారు, లక్ష్మీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

సొంత నిధులతో పాఠశాల అభివృద్ధి

- నరేష్ సేవాభావానికి పలువురి అభినందన



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు వెన్నల నరేష్ సొంత నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అమృతపురం ప్రాథమిక పాఠశాల ఆట స్థలంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును మండల టిడిపి అధ్యక్షులు గండి ముత్యాల నాయుడు ప్రారంభించారు. సమాజాన్ని మార్చగల శక్తి చదువుకు ఉందన్న నమ్మకంతో సొంతూరులోని పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే రూ.2.50లక్షల సొంత నిధులతో పాఠశాలలో తరగతి గదులు, ప్రహరీ మరమ్మతులు, పాఠశాల మెయిన్ గేటు, మధ్యాహ్న భోజన నిర్వహణకు వంటశాల నిర్మాణం, వంటశాలలో గ్యాస్ స్టవ్, కుక్కర్ వంటి సామగ్రిని సమకూర్చిన నరేష్, ఇపుడు అదే పాఠశాలలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధికి నరేష్ చేపడుతున్న చర్యలను మండల టిడిపి అధ్యక్షుడు ముత్యాలనాయుడుతోపాటు పలువురు అభినందిస్తున్నారు. నరేష్ ఆర్థికంగా ఎదిగి మున్ముందు గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేసిన నరేష్‌కు వాలీబాల్ క్రీడాకారుడు పట్నాల హరీష్ టీమ్ తరుపున ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో గండి రమణబాబు, గండి సన్యాసి నాయుడు, వడిశల అప్పారావు, కర్రి సత్యనారాయణ, వాలీబాల్ కోచ్ గండి రాం స్వామి నాయుడు, గొటివాడ స్మార్ట్ కుమార్, సన్యాసిరావు, పుచ్చ పెద గడ్డయ్య, పట్నాల హరీష్ పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో స్వచ్ఛతా కార్యక్రమం



పురుషోత్తపురంలో స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని పురుషోత _పురం గ్రామంలో ఆదివారం 'ఏకదిన్ ఏక్ గంట్, ఏక్ సాత్' స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు.. అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షులు కొలకులూరి విజయ బాబు ఆధ్వర్యంలో పారిశుధ్యపనులు చేపట్టారు. ఈసందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకునే తీరులోనే, గ్రామాన్ని కూడా శుభ్రం చేసుకోవాలని, దీనికి వారంలో ఏదో ఒకరోజు, ఒక గంట కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మండల యూనిట్ ఇన్చార్జి రాజాన వెంకునాయుడు, రాజాన సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ, శ్రీను, ఎన్టీఆర్ యూత్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొన్ని వస్తువులకే జిఎస్‌టి తగ్గింపు

- ఆర్భాటపు ప్రచారం స్థాయిలో... కానరాని అమలు చర్యలు
- పాత, కొత్త ధరల బోర్డుల ఏర్పాటులోనూ నిర్లిప్తత
- కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల



మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సవరించిన జిఎస్‌టి తర్వాత వస్తువుల పాత రేట్లు, కొత్త రేట్లతో ప్రతి వ్యాపార సంస్థ బోర్డులు ఏర్పాటు చేయాలని కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. దీనివల్ల వస్తువు ధర ఎంత తగ్గిందనేది కొనుగోలుదారులకు తెలుస్తుందన్నారు. ఆదివారం పబ్లిక్ ఫోరం కార్యాలయంలో 'జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలు-వినియోగదారుల హక్కులు' అంశంపై జరిగిన వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపు ధరలు క్షేత్రస్థాయిలో వినియోగదారులకు అందడం లేదని, ధరలను అదుపు చేయాల్సిన అధికార యంత్రాంగం మొక్కుబడిగా 'అవగాహన' సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. 'క్యూఆర్ కోడ్'ను స్కాన్ చేస్తే జిఎస్‌టి ఎంత తగ్గుతుందో తెలుస్తుందన్నారు. ఏసీలు, టివిలు, వివిధ ఎలక్ట్రికల్ పరికరాలు, వాహనాలు వంటి పెద్ద వస్తువులకు తగ్గింపు ధరలకు జరుగుతున్న ప్రచారం, నిత్యం సామాన్యులు వినియోగిస్తున్న వస్తువులకు జరగకపోవడం విచారకరమన్నారు. జిఎస్‌టి శ్లాబ్‌లు తగ్గాయని విస్తృత ప్రచారం చేసుకుంటున్న పాలకులు, అధికార యంత్రాంగం, అవి అమలు కాకుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలో ప్రచారం చేయకపోవడంలో అంతర్యమేంటని ధ్వజమెత్తారు. తగ్గిన ధరలు అమలు కాకపోతే నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్ 1915 లేదా 1800 11 4000 నెంబర్లకు, స్థానికంగా ఉన్న తూనికలు కొలతల శాఖ, జిఎస్‌టి అధికారులకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. కొన్ని వస్తువులకు సంబంధించి బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనాలపై ఫోరం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో కన్జ్యూమర్ రైట్స్ సేఫ్‌గార్డింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్య నారాయణ (పరవాడ),రాంబిల్లి వినియోగదారుల మండలి అధ్యక్షుడు ఎస్.నూకరాజు (రాంబిల్లి), కన్జ్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నందవరపు సంజీవరావు (బుచ్చయ్య పేట), బొడ్డేడ జగ్గఅప్పారావు (మునగపాక), పైలా రవి (చోడవరం), వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి

చేతులు జోడించి దళితుల నిరసన

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలోని దళిత కాలనీ వద్ద చెత్తా చెదారం తీసుకొచ్చి వేయడం తగదని, తక్షణమే తొలగించాలని అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు చేతులు జోడించి ఆదివారం నిరసన చేపట్టారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే. గోవిందరావు మాట్లాడుతూ, దళిత కాలనీ వద్ద చెత్తతో దళితులు అనేక రోగాలు బారిన పడే అవకాశం ఉందన్నారు. రాత్రి సమయంలో దుర్వాసన కారణంగా భోజనం కూడా చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. మండల కేంద్రమైన రావికమతం పంచాయతీలో 5000 జనాభా ఉన్నారన్నారు. ఈ గ్రామానికి శాశ్వత డంపింగ్ యార్డ్ లేకపోవడం అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై చెత్త వేసిన ప్రదేశం వద్ద గత నెల 30న ఆందోళన నిర్వహించి, జిల్లా కలెక్టర్కు పిర్యాదు చేయడం జరిగిందన్నారు. తక్షణమే పంచాయతీ కార్యదర్శి ప్రోక్లైన్ తీసుకువచ్చి చెత్తంతా దళిత కాలనీ వద్ద వేయడంతో 250 మంది జనాభా దుర్వాసన భరించలేక రాత్రి పూట కంటిమీద నిద్ర లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అనకాపల్లి జిల్లా కలెక్టర్ రావికమతం గ్రామాన్ని సందర్శించాలని, అలాగే దళితవాడలో వేసిన చెత్తాచెదారాన్ని కూడా పరిశీలించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రచారం చేస్తుంది తప్ప, వాస్తవానికి ఆ పరిస్థితి ఎక్కడా కనిపించ లేదన్నారు. రావికమతం మండలం కేంద్రంలో డంపింగ్ యార్డ్ లేకపోవడం పట్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోక పోవడం చాలా అన్యాయం అన్నారు. తక్షణమే పరిష్కారం జరగకపోతే భారీ ఎత్తున ఆందోళన నిర్వహించడానికి వెనకాడే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి సిహెచ్ సూరిబాబు, పంచాయతీ 12వ వార్డు సభ్యుడు రాజు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, దళితులు



సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్

భూముల రీ సర్వేపై గ్రామ సభ

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని కుమారపురంలో భూముల రీ సర్వే గ్రామ సభ జరిగింది. రామాలయం వద్ద జరిగిన ఈ గ్రామ సభకు తహశీల్దారు ఎస్ఎ మహేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా తహశీల్దారు మహేశ్వరరావు మాట్లాడుతూ... మండలంలోని 19 రెవెన్యూ గ్రామాలకుగానూ ఇప్పటికే 18 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేశామని, ప్రస్తుతం కుమారపురంలో రీ సర్వే ప్రారంభించామన్నారు. ఇందుకోసం నాలుగు టీమ్ లను నియమించామని, మూడు నెలల వ్యవధిలో ఈ సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలు, హక్కు పత్రాలను సర్వే సిబ్బందికి చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ టి.త్రినాధ్, స్థానిక నాయకులు రావాడ గోవింద రెడ్డి, నీలాపు బాలానంద రెడ్డి, కుప్పిలి సురేష్ కుమార్, యన్నంరెడ్డి శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, వీఆర్వోలు ఆర్.వెంకట రాజేష్, ఎల్ కోటేశ్వరరావు, వి.రామస్వామి, ఆర్.వరహాలరావు, వి.నూకరాజు, కె.రాజు, రవి రాజు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

శ్రమదానంతో మట్టి రోడ్డు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తీగల వలస పంచాయతీ నుంచి పనసబంధ గ్రామం వరకు సుమారు 2 కిలోమీటర్ల మట్టి రోడ్డు వర్షాలకు కోతకు గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో పనసబంధ గ్రామస్థులు ఆదివారం శ్రమదానంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. 40 మంది గిరిజనులు కలిసి కోతకు గురైన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడంలోనూ, పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణానికి కావలసిన ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి రవాణాలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు చెప్పారు. 2017 సంవత్సరంలో ఈ మట్టి రోడ్డు కోసం గ్రాంట్ మంజూరైనప్పటికీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ పెద్దలు కిల్లో వంశీ, సీదారి చందు (వార్డు సభ్యుడు), సీదారి చిట్టిబాబునాయుడు, సీదారి బాలరాజు, బింబాబు, సన్యాసిరావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

వృథాగా వాణిజ్య సముదాయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో లింగాపురం సెంటర్ వద్ద సుమారు 25 లక్షలతో నిర్మించిన 14వాణిజ్య సముదాయ షాపులు గడిచిన మూడు సంవత్సరాలగా వృథాగా దర్శనమిస్తోంది. నాలుగు రోడ్ల కూడలిలో ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఈ వాణిజ్య సముదాయం గత టిడిపి ప్రభుత్వంలో పంచాయతీ నిధులతో మొదలుకాగా ఎట్టకేలకు గడిచిన వైసిపి ప్రభుత్వంలో నిర్మాణం పూర్తి చేశారు. 2023 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబురావు లాంచనంగా వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించారు. అయినప్పటికీ వాటిని వినియోగం లోకి రాకపోవడం పట్ల మండల వ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ సముదాయం మండల వ్యాప్తంగా డిమాండ్ కూడా ఉంది. అయినప్పటికీ ఇటు గ్రామస్థాయి అధికారుల నుండి, మండల పరిషత్ అధికారులు వీటిని వినియోగంలోకి తీసుకు రాకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందంటూ పలు సంఘాల నాయకులతో పాటు సమీపప్రాంత ప్రజలు విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నిరుపయోగంగా ఉన్న వాణిజ్య సముదాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా షాపులు

షాపులకు వేలం ఎప్పుడో?

మండల పరిషత్‌కు చెందిన..

- పేరుకుపోయిన పాత అద్దె బకాయిలు
- బినామీల పేరుతో పాతవారికే కేటాయింపు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం మేజరు పంచాయితీ కొత్తకోటలో మండల పరిషత్‌కు చెందిన వాణిజ్య సముదాయం షాపుల వేలం, దుకాణాలు కేటాయింపు, అద్దెల వసూళ్ల ప్రక్రియ అవినీతిమయంగా మారింది. గత కొన్నేళ్లు కిందట వేలంలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదనే ఆరోపణలు గత కొంత కాలంగా వినిపిస్తున్నాయి. పాత అద్దె బకాయిలు వసూలు కాక పోగా కొత్త వారికి అవకాశం ఇవ్వకుండా ఏళ్ల తరబడి పాత వారే తిష్ట వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అద్దె బకాయిలు చెల్లించని వ్యాపారులే తిరిగి బినామీ పేర్లతో అధికారుల సహకారంతో దుకాణాలు దక్కించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి మూడేళ్లు కు వేలం పాటలు నిర్వహించాల్సిన సంబంధిత అధికారులు ఆ దశగా చర్యలు తీసుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కొత్తకోట బిఎన్ రోడ్డుకు అనుకోని ప్రైవేటు దుకాణాలు అద్దె రూ.5వేల నుంచి రూ.15వేల వరకూ వసూలు చేస్తున్నారు. మండల పరిషత్ దుకాణాలకు మాత్రం నామమాత్రపు అద్దె ఇవ్వకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ మూడేళ్లకు ఓసారి దుకాణాలను వేలం నిర్వహించాల్సి ఉన్నా గడచిన కొంతకాలంగా ఆ ఊసే లేదు. దుకాణాల కేటాయింపుకు పలు నిబంధనలన్నాయి. దీనికి విరుద్ధంగా, అవకతవకలు జరుగుతున్నా దానిపై విచారణ చేపట్టిన ఆనవాళ్లు లేవు. ఈ దుకాణాల అవినీతి పై చర్యలు తీసుకోవాలంటూ కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవ జిల్లా కలె క్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి గత నెలలో అద్దె దుకాణాలను పరిశీలించారు. గత కొన్నేళ్లుగా వేలం పాట నిర్వహణ జరగలే దని ధ్రువీకరించారు..

పేరుకు పోయిన అద్దె బకాయిలు

కొత్తకోటలో మండల పరిషత్ కు చెందిన 16 వరకు దుకాణాలు ఉన్నాయి. మండల పరిషత్ దుకాణాలకు మాత్రం నూ.400 నుంచి రూ.1000 వరకు నామమాత్రపు అద్దె చెల్లిస్తున్నారు. ఒక్కో షాపు నుంచి వేలల్లో అద్దె బకాయిలు ఉన్నాయి. రాజకీయ పలుకుబడితో, బినామీ పేర్లతో అదే షాపుల్లో కొనసాగుతూ వస్తున్నారు. కొందరైతే ఎంచక్కా ఇతరులకు అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. వేలం నిర్వహించినప్పుడు పాటదారుల పేర్లు మాత్రమే మారతాయి. వ్యాపారులు మాత్రం పాతవారే కొనసాగుతుంటారు. కొత్తవారికి అవకాశం ఉండటం లేదు, మండల పరిషత్ కు ఆదాయం పెరగడం లేదు.



కొత్తకోటలో ఓ షాపు



భవనంపై పిచ్చి మొక్కలు

పురాతన భవనంపై పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి -నర్సీపట్నం: బ్రిటిష్ కాలంలో నిర్మించిన అతి సుందర పురాతన భవనం నేడు పిచ్చితుప్పల డొంకలు దర్శనమిస్తోంది. సాక్షాత్తు తహసిల్దార్ కార్యాలయం ఆవరణ సమీపంలో వందల ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టి వివిధ కార్యాలయాలకు సేవలందించిన ఈ భవనం దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ శిథిల పురాతన భవనానికి ఆనుకొని సబ్ ట్రెజరీ కార్యాలయంలో బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తూ ఉండగా, తహసిల్దార్ కార్యాలయం మాత్రం మరమ్మత్తు చేపట్టి కార్యాలయంగా వినియోగించుకుంటున్నారు. పురాతన భవనాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయడంతోనే శిథిలావస్థకు చేరుకుందని స్థానికులు తెలిపారు. కార్యాలయ ఆవరణమంతా పిచ్చి తుప్పలు మొలిచి విష సర్పాలు సంచరిస్తూ ఉన్నాయి. గతంలో తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో కోర్టుల సముదాయం ఉండేది. ప్రస్తుతం కోర్టుల సముదాయం చింతపల్లి రోడ్డు డిగ్రీ కళాశాల ఆవరణకు మారింది.అధికారులు ఇటువంటి పురాతన భవనాలను సంరక్షించి భావితరాలకు గుర్తుగా వీటిని తీర్చిదిద్దాలని నర్సీపట్నం సీనియర్ నాయకులతో పాటుగా పట్టణ పెద్దలు కోరుకుంటున్నారు.



ఉత్సవం నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఘనంగా ముస్లిముల ఉత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పెదబోదు గల్లం, రామకృష్ణాపురం, చినబోదిగల్లం ముస్లిం గ్రామాల్లో ఆదివారం గ్యార్మీ షరీఫ్ ఉత్సవాన్ని ముస్లిం సోదరులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్ధనలు చేసి చందనం పూసిన జెండాలను గుర్రాలపై వేసి ఊరేగించారు. అనంతరం దర్గాకు వెళ్లి జెండాలు ఉంచి, ప్రార్ధనలు చేసారు.ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -చీడికాడ: మండల కేంద్రంలో అక్షర శ్రీ విద్యానికేతన్ పాఠశాల వద్ద ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇట్స్ మై విలేజ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 63 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా వారిలో 31 మందికి కంటి ఆపరేషన్‌లకు గుర్తించి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మధు, బొబ్బిలి నవీన్, బొబ్బిలి కిషోర్, సిరికి నాగేష్, శంకర్ ఫౌండేషన్ డాక్టర్ అరుణ, క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ రేణుక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాజాపై దాడులు హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రెండేళ్లుగా గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని ఖండిస్తూ 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా' ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ -పాలస్తీనా మీద సాగిస్తున్న మారణహోమంలో నేటికి 67 వేల మందికి పైగా చంపబడ్డారని, కొన్ని లక్షలమంది గాయాల పాలయ్యా న్నారు. ఈ దురాక్రమణని క్షేత్రస్థాయిలో రిపోర్ట్ చేస్తున్న జర్నలిస్టులను కూడా ఇజ్రాయిల్ సేనలు టార్గెట్ చేసి చంపుతున్నాయన్నారు. యుద్ధం ఆపాలని ఐక్యరాజ్య సమితిలో చేస్తున్న తీర్మానాలకు పదేపదే అడ్డం పడుతున్నది అమెరికాయేనని తెలిపారు. గత 70 సంవత్సరాలుగా పాలస్తీనాకి మద్దతుగా ఉన్న బిజెపి అధికారం చేపట్టిన నాటి నుండి ఇజ్రాయిల్ కి మద్దతుగా ఉండడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్ దౌత్యాన్ని బహిష్కరించాలని, భారత కంపెనీలు ఇజ్రాయిల్‌లో పెట్టిన పెట్టుబడులను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇండిఇండియన్ పీపుల్ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా కార్యకర్త సుజన్, మానవ హక్కుల వేదిక నాయకులు వి.ఎస్ కృష్ణ, భారత నాస్తిక సమాజం ప్రతినిధి జె.శ్యామల, అడ్వకేట్ జహహర్, జర్నలిస్ట్ అరుణ, న్యూ డెమోక్రసీ కె.రవి,దళిత విముక్తి నేత సుర్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు

నీటి వృథాను పట్టించుకోరా?

ప్రజాశక్తి -వడ్డాది: వడ్డాదిలో పంచాయతీ కుళాయిల పైపులైన్ శిథిలమై తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు అంటున్నారు. స్థానిక పెద్దేరు వంతెన నుంచి వడ్డాది జంక్షన్‌కు పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఇటీవల వర్షాల వలన వంతెనకు ఇరువైపులా మట్టి పేరుకుపోవడంతో మట్టిని తొలగించారు. మట్టిని తొలగించే క్రమంలో పైప్‌లైన్‌కు రంధ్రం కావడంతో దాని గుండా నీరు వృథాగా పోతోంది. వంతెనపైనుంచి స్థానిక జంక్షన్ వరకు వారం రోజులుగా భారీగా నీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, పైపులైన్ లీకేజీని అరికట్టి, నీటి వృథాను నివారించాలని కోరుతున్నారు.



పైపు లీకేజీతో వృథాగా పోతున్న నీరు



వైద్యులతో మాట్లాడుతున్న వంశీకృష్ణ శ్రీనివాస్

చిన్నారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జాలరిపేటలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గంజిపడి గాయాలపాలై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి స్థానిక వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు త్వరగా కోలుకునే విధంగా మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ వాసవిలత, ప్లాస్టిక్ సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ టి.మోహనరావు, వార్డు అధ్యక్షులు యజ్ఞశ్రీ, రమణ, జనసేన నేత శ్రావణ్ పాల్గొన్నారు.

పండిట్ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన పండిట్ పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని భాష పండితులు ప్రభాకర్, రాజబాబు, గంగా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని 417 పండిట్ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బెల్ట్‌షాపులపై దశల వారీ ఉద్యమం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి : మద్యం బెల్టుషాపులపై దశలవారీ ఉద్యమం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎం.ఎర్రునాయుడు అధ్యక్షతన సిపిఎం విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ షాపులకు అనుబంధంగా చిన్నగ్రామాల్లో పానుషాపులు, దాబాలు, టీ దుకాణాల్లోనూ విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, ఇది అత్యంత దుర్మార్గ మన్నారు. బెల్ట్‌షాపుల్లో ఎంఆర్‌పి ధర కంటే రూ.50 నుంచి రూ.100 వరకు అదనపు ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ, పేదల రక్తాన్ని పీల్చేస్తున్నారని మండిపడ్డారు. బెల్ట్‌షాపుల నిర్వహణకు కొన్నిగ్రామాల్లో అనధికార వేలం పాటలు నిర్వహించి సొమ్ము చేసుకుంటున్నారంటే ఈ వ్యవహారం గ్రామాల్లో ఎంత విచ్చలవిడిగా, బాహాటంగా సాగుతుందో స్పష్టమౌతోందన్నారు అందుబాటులో విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో పేదలతోపాటు యువత కూడా మందుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడి,గుళ్లకు 200 మీటర్ల దూరంలో మద్యం షాపులు పెట్టాలన్న లైసెన్స్ దుకాణాలకు కొంతవరకు అమలు చేస్తున్నా, బెల్ట్‌షాపులను ఇక్కడా, అక్కడా అనే తేడా లేకుండా బార్లా తెరవడంతో అనేక పేద కుటుంబాలు రోడ్డున పడడంతోపాటు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బాలికలపై అకృత్యాలు, మహిళలపై వేధింపులు, ఇతర అసాంఘిక చర్యలకు కారణమౌతున్న బెల్ట్‌షాపులపై సంబంధిత ఎక్సైజ్‌శాఖతోపాటు పోలీసులు,ఇతర అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నందున వీటిని అరికట్టేందుకు దశలవారీ పోరాటం చేద్దామన్నారు.కార్యక్రమంలో బి నాగేశ్వరరావు, డి.శంకర్, సిహెచ్ దేముడు, జె ఈశ్వరరావు, వి దొంగబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

డైట్‌లో ముగిసిన ఎఫ్‌డిపి

ప్రజాశక్తి- అనకాపల్లి స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బిఎస్ఎన్ఎల్ సహకారంతో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో 'అన్ ఫోల్డింగ్ నెక్స్- జెన్ నెట్వర్క్స్ ఇన్ టర్న్ ఆఫ్ ఇండస్ట్రీ ఆటోమేషన్' అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) ఆదివారం ముగిసింది.రిసోర్స్ పర్సన్స్‌గా బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్, చైతన్య, త్రివేణు, గోపాల్ కడలి వ్యవహరించారు. ఐఒటి, ఇండస్ట్రీ 4.0, ఎమ్ఎమ్, డ్రోన్ టెక్నాలజీ, 5జీ మొబైల్ కమ్యూనికేషన్ తదితర అధునాతన టెక్నాలజీలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. మిస్టర్ భరద్వాజ్ హ్యాండ్ ఆన్ సెషన్‌ను అధ్యాపకులచే నిర్వహించారు.కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఎం సత్య ప్రసాద్, త్రివేణు గోపాల్ కడలి, కె భరద్వాజ్‌ను ఛైర్మన్ దాడి రత్నాకర్ సత్కరించారు.



బిఎస్ఎన్ఎల్ డిజిఎం సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న రత్నాకర్

నునపర్తి జంక్షన్‌లో సిసి కెమెరాలు

'ప్రజాశక్తి' కథనానికి పరవాడ సిఐ స్పందన

ప్రజాశక్తి -పరవాడ : నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలోనూ సిసి కెమెరాలు ఏర్పాటు ముఖ్యమని పరవాడ సిఐ మల్లికార్జున అన్నారు. సిసి కెమెరాల ఏర్పాటుతో చాలావరకు దొంగతనాలు నివారించే అవకాశం ఉందన్నారు. ఆదివారం రావాడ పంచాయతీ పరిధిలో గాజువాక-యలమంచిలి ప్రధాన మార్గంలో నునపర్తి జంక్షన్‌లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. నునపర్తి జంక్షన్ వద్ద ఇటీవల వరుసగా విద్యార్థుల సైకిళ్లు దొంగతనాలు ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో. గత నెల 20న 'బాబోయ్ సైకిల్ దొంగలు' శీర్షికతో ప్రజాశక్తి కథనం రాగా సిఐ స్పందించారు. నునపర్తి జంక్షన్‌లో పరిస్థితులను పరిశీలించి, సైకిల్లచోరీకి అడ్డకట్ట వేయాలంటే, ఆ ప్రాంతంలో సిసి కెమెరాలను ఏర్పాటు అవసరాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ప్రతినిధితో సిఐ మల్లికార్జున మాట్లాడుతూ.. సిసి కెమెరాలు ఏర్పాటుతో చాలావరకు దొంగతనాలు నివారించే అవకాశం ఉందన్నారు. చోరీ ఘటనలను నియంత్రించడంతోపాటు తర్వాత దొంగలను పట్టుకోవడంలో సిసి ఫుటేజీ ఎంతగానో దోహదపడు తుందన్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. సిసి కెమెరాలు ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ లో ప్రజలు భాగస్వాములై సహకరించాల న్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తుకు బానిసలు కాకుండా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.



నునపర్తిలో స్తంభానికి అమర్చిన సిసి కెమెరాలు